సాక్షి కామారెడ్డి

శనివారం । 6 । మే । 2023



దళారులను ఆశ్రయించొద్దు

రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ప్రజాప్రతినిధులు సూచించారు.

- 9లో ▸



కొనసాగుతున్న సమ్మె

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని చేపట్టిన సమ్మె శుక్రవారం ఎనిమిదో రోజూ కొనసాగింది.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /23.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

పంట నష్టం 150 కోట్లు..!

యాసంగిలో ఎన్నో ఆశలతో వరి సాగు చేసిన రైతన్నకు నష్టాలే మిగిలాయి. నాట్లు వేసిన నాటి నుంచి తెగుళ్ల వ్యాప్తి, ప్రకృతి ప్రకోపంతో అన్నదాత అవస్థలు పడుతూనే ఉన్నాడు. నాటు వేయగానే ఉల్లికోడు, మొగి పురుగు సోకి ఇబ్బందులు పెడితే.. ప్రస్తుతం అకాల వర్షాలు ఆగం చేస్తున్నాయి. చేతికొచ్చిన పంట నేలపాలవడంతో కర్షకులు కన్నీరు పెడుతున్నారు.

- వడగండ్ల వానతో నేలరాలిన వరిగింజలు
- పెట్టుబడులు కోల్పోయి అప్పులపాలు
- వరి రైతులకు కోలుకోలేని దెబ్బ



లింగంపేట మండలం బోనాల్ గ్రామంలో వడ్లు రాలిపోయిన వరి

సాక్షి, కామారెడ్డి: వడగండ్ల వాన వరి రైతు వెన్ను విరిచింది. వారం రోజులుగా జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షంతో పంటలు నేల పాలయ్యాయి. ముఖ్యంగా చేతికందిన వరి పంట దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలో 62,461.22 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఎకరా వరి సాగుకు కనీసం రూ.25 వేలు ఖర్చు అవుతుంది. రైతు రెక్కల కష్టం అదనం. పంట చేతికందే సమయంలో వడగండ్లు సృష్టించిన బీభత్సంతో చాలా గ్రామాల్లో వరి గింజలు నేలరాలాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధికారిక లెక్కల ప్రకారం వరి పంట నష్టం రూ.150 కోట్ల పైనే ఉంటుంది. గత నెలలో 22న కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసి 686.22 ఎకరాల్లో పంట దెబ్బతిన్నది. తరువాత 25 నుంచి ఈ నెల 1 వరకు అకాల వర్షాలు జిల్లా వ్యాప్తంగా కురిశాయి. దాదాపు జిల్లాలోని సగానికిపైగా గ్రామాల్లో వడగండ్ల వానలతో పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వరి సాగు చేసిన రైతులు సీజన్‌లో మూడు సార్లు తెగుళ్ల పంటను దెబ్బతీశాయి. తెగుళ్ల నుంచి కోలుకుని పంట కోద్దామనే సమయంలో ఒక్కసారిగా వర్షాలు పడటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. లింగంపేట మండలంలోని ఒక్క బోనాల్ గ్రామంలోనే 508 ఎకరాల్లో వరి పంటను వడగండ్లు నాశనం చేశాయి. దీంతో రైతులు రోడ్డున పడ్డారు. గ్రామానికి వచ్చిన తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తో తమ గోడును వెళ్లబోసుకున్నారు.

25 క్వింటాళ్ల దిగుబడి వస్తే..

వరి పంట బాగుండి ఎలాంటి తెగుళ్ల సమస్య రాకుండా, సరిపడా నీరందినపుడు ఎకరాకు 25 క్వింటాళ్ల నుంచి 28 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే వడ్లు అమ్మగా రూ.50 వేలు వస్తాయి. అయితే పంట సాగుకు అయ్యే ఖర్చు రూ.25 వేలు పోతాయి. అయితే ఈ సారి యాసంగిలో పంటలకు మూడు పర్యాయాలు తెగుళ్లు సోకి పంట మొత్తం నాశనం అయింది. ఎలాగోలా తేరుకుని చేతికందిన పంటను కోసేలోపు వడగండ్లు సృష్టించిన బీభత్సానికి పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో రైతులు కోలుకోలేని పరిస్థితి నెలకొంది.

తడిసిన ధాన్యంతో అవస్థలు

ఓ వైపు రైతులకు వడగండ్లు కడగండ్లు మిగిలిస్తే, మరోవైపు ముందుగా వరి కోసిన రైతులనూ కష్టాలు వెన్నాడుతున్నాయి. ధాన్యం తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ చేశారు. కాంటాలు మొదలుకాక ముందే వర్షాలు కురవడంతో తడిసి పోయి మొలకలొచ్చాయి. దీంతో మిల్లర్లు నానా కొరివిలు పెడుతున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా, ఇంకా ఎక్కడా కొనడం లేదు. దీంతో రైతులు 15 రోజులుగా కేంద్రాల వద్దే వానలో నానుతూ, చలిలో వణుకుతూ కాలం వెళ్లదీస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టడానికి నానా అవస్థలు పడుతున్నారు.

మళ్లీ వర్ష బీభత్సం

సాక్షి, కామారెడ్డి : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మళ్లీ వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో వడగళ్లతో పాటు భారీ వర్షం కురిసింది. కామారెడ్డి పట్టణంలో దాదాపు గంటన్నర పాటు కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. భారీ వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది.

జిల్లాలో దెబ్బతిన్న వరి పంట వివరాలు

తేది	మండలాలు	గ్రామాలు	దెబ్బతిన్న వరి (ఎకరాల్లో)
ఏప్రిల్ 22	06	13	686.22
ఏప్రిల్ 25	17	171	31,128.00
ఏప్రిల్ 28	14	21	2,449.00
ఏప్రిల్ 29	02	02	489.00
ఏప్రిల్ 30	13	118	24,420.00
మే 01	07	56	3,289.00
మొత్తం	-	-	62,461.22

ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి

వరి సాగుకు యాసంగిలో దాదాపు అందరు రైతులు ఎకరాకు రూ.25 వేల పైనే ఖర్చు చేశారు. 25 కిలోల బస్తా విత్తనానికి రూ.850 ఖర్చు చేశారు. గతంలో ప్రభుత్వాలు సబ్సిడీపై విత్తనాలు అందించేవి. సబ్సిడీ విత్తనాలు ఎప్పుడో బందు చేశారు. దుక్కితో పాటు కేజ్‌వీల్ కోసం రూ.6 వేలు, ఒడ్లు చెక్కడం కోసం రూ.2,800 ఖర్చు అవుతాయి. నాటు వేయడానికి రూ.6 వేలు, ఎరువులకు, పురుగు మందులకు రూ.10,200 ఖర్చయ్యాయి. తక్కువలో తక్కువ ఎకరాకు రూ.25 వేలు ఖర్చు చేయాల్సిందే. దీనికి తోడు బోరు మోటారు, స్టార్టర్ చెడిపోయినా, వైర్లు కాలిపోయినా అయ్యే ఖర్చులు అదనం. అలాగే రైతు రాత్రింబవళ్ల కష్టం లెక్కనే లేదు.

క్రిమినల్ చర్యల దిశగా..

- మరింత స్పీడ్ పెంచిన తెయూ పాలకమండలి
- రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరి పునర్నియామకం
- ముగ్గురు రిజిస్ట్రార్లపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు తీర్మానం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ వర్సిటీలో పాలకమండలి సభ్యులు, వైస్ చాన్స్‌లర్ మధ్య నడుస్తున్న పోరు మరో స్థాయికి చేరుకుంది. శుక్రవారం వీసీ రవీందర్ గుప్తా ఉన్నతవిద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌పై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ వర్సిటీ నుంచి ప్రకటన విడుదల చేశారు. మరోవైపు నవీన్ మిట్టల్ చైర్మన్‌గా శుక్రవారం హైదరాబాద్‌లోని రూసా భవనంలో తెయూ పాలకమండలి 57వ సమావేశం జరిగింది. వీసీ రవీందర్ గుప్తా నవీన్ మిట్టల్‌పై ఆరోపణల పర్వాన్ని మరింత పెంచగా, పాలకమండలి సభ్యులు సైతం తమ చర్యలకు మరింత పదును పెడుతున్నారు. వర్సిటీ వ్యవహారాల విషయమై ఉన్నత స్థాయి దర్యాప్తు చేయించేందుకు, ముగ్గురు రిజిస్ట్రార్లపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు తీర్మానం చేయడం గమనార్హం.

నవీన్ మిట్టల్ చైర్మన్‌గా..

వర్సిటీలో చోటుచేసుకున్న అక్రమాలపై ఉన్నత స్థాయిలో విచారణ చేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు పాలకమండలి తీర్మానం చేసింది. తెలంగాణ యూనివర్సిటీల చట్టం 1991 మేరకు సెక్షన్ 18(1) ప్రకారం 10 మంది సభ్యుల కోరం ఉండడంతో ఈసీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వీసీ హాజరు కాకపోవడంతో ఉన్నతవిద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ చైర్మన్‌గా వ్యవహరించారు. 1991 యూనివర్సిటీల చట్టంలోని సెక్షన్ 15(1) ప్రకారం రిజిస్ట్రార్‌ను నియమించేందుకు ఉన్న పూర్తి అధికారంతో పాలకమండలి ప్రొఫెసర్ యాదగిరిని పునర్నియామకం చేసింది. 2021 అక్టోబర్ 30న యాదగిరిని రిజిస్ట్రార్‌గా ఈసీ నియమిస్తే, వర్సిటీల చట్టంలోని 50.6(ఏ) నిబంధనలకు విరుద్ధంగా వరుసగా ముగ్గురిని రిజిస్ట్రార్లుగా వీసీ నియమించడం చట్టవ్యతిరేకమన్నారు. ఈసీ నియమించిన రిజిస్ట్రార్ పదవీకాలం పూర్తయితే లేదా ఆ స్థానం ఖాళీగా ఉంటే మాత్రమే కొత్త రిజిస్ట్రార్‌ను నియమించాల్సి ఉంటుందన్నారు. అయితే ఈసీ ఆమోదం లేకుండా శివశంకర్, విద్యావర్ధిని, నిర్మలాదేవి బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో వాళ్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని నిర్ణయించారు. అక్రమ నియామకాలు, నిబంధనల ఉల్లంఘన, అడ్డగోలు చెల్లింపులకు సంబంధించి చెక్కులపై సంతకాలు పెట్టడం, నిధుల దుర్వినియోగం తదితరాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, ఏసీబీ డీజీ, నిజామాబాద్ సీపీలతో ఉన్నతస్థాయి విచారణ చేయించాలని తీర్మానించారు. 2022-23, 2023-24 బడ్జెట్‌కు సంబంధించి సైతం విచారణకు నిర్ణయించారు. ఈ నెల 12న మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. తెయూలో అక్రమాలపై వరుస కథనాలను ప్రచురించిన 'సాక్షి'కి పాలకమండలి సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పాలకమండలి సభ్యులు గంగాధర్‌గౌడ్, వసుంధరా దేవి, మారయ్యగౌడ్, ఎస్ఎల్ శాస్త్రి, రవీందర్‌రెడ్డి, ఆరతి, నసీమ్, ప్రవీణ్‌కుమార్, చంద్రకళ పాల్గొన్నారు.

వర్సిటీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు..

తెయూ (డిచ్‌పల్లి) : తనపై తప్పుడు, అవినీతి ఆరోపణలతో తెలంగాణ యూనివర్సిటీ ప్రతిష్టను నాశనం చేస్తూ.. తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్ లక్ష్యమని తెయూ వీసీ రవీందర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తనను వీసీగా నియమించారని, అయితే నవీన్ మిట్టల్ ఇప్పుడు బ్యాక్‌డోర్ పద్ధతుల ద్వారా తన పరువు తీయాలని చూస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ కొన్ని నిరాధారమైన ఆరోపణలకు, వివాదాలకు కేంద్రంగా మారిందన్నారు. వీటన్నింటికీ నవీన్ మిట్టల్ కారణమని చెప్పడానికి తనకు బాధగా ఉందన్నారు. మిట్టల్ తన నామినీ అయిన ప్రొఫెసర్ యాదగిరిని రిజిస్ట్రార్‌గా ఎలాగైనా నియమించాలనే తపనతో ఇదంతా చేస్తున్నారన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగే విధంగా చూడాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో ఆయన మాట్లాడారు. పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. పంట నష్టపోయిన రైతులకు ధైర్యం చెప్పాలని అధికారులకు సూచించారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు పంపించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు ధాన్యం తరలింపు వేగవంతం చేయాలన్నారు. రైతులకు అందుబాటులో టార్పాలిన్లు, గన్ని బ్యాగులను ఉంచాలని సూచించారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఎస్‌వో పద్మ, సివిల్ సప్లయ్ డీఎం అభిషేక్ సింగ్, జిల్లా సహకార అధికారి వసంత పాల్గొన్నారు.



మేఘాలను చీల్చుకుని సూర్య కిరణాలు చెట్ల కొమ్మలపై పడి ఇంద్రధనుస్సును తలపించేలా ఉన్న దృశ్యం ఆకాశంలో కనువిందు చేసింది. ఈ చిత్రాన్ని కామారెడ్డి – గాంధారి రహదారిపై శుక్రవారం ఉదయం 'సాక్షి' క్లిక్ మనిపించింది. – సాక్షి, కామారెడ్డి

85 శాతం పంటనష్టం సర్వే పూర్తి



మాల్తుమ్మెదలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నాగిరెడ్డిపేట: అకాల వర్షాలతో నష్టపోయిన పంటల వివరాల కోసం చేపట్టిన సర్వే జిల్లాలో 85 శాతం పూర్తయిందని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని మాల్తుమ్మెదలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. తేమశాతం 17 కంటే తక్కువ వచ్చిన ధాన్యాన్నే తూకం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 347 కొనుగోలుకేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 61వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. రూ.20కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో 62వేల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని, సర్వే పూర్తయిన తర్వాత పంటనష్టంపై తుది నివేదిక తయారు చేస్తామని వివరించారు. తహసీల్దార్ సయీద్ అహ్మద్ మస్రూర్, ఏన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సురేష్, మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ నర్సింలు, సీఈవో పవన్ ఉన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

లింగంపేట: తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి, మాలపాటి, పర్మళ్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం తూకం ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. లారీల కొరత లేకుండా చూస్తామన్నారు. రైతులు సంయమనం పాటించాలని సూచించారు. తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, సీఈవో శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సొసైటీ చైర్మన్ నర్సింలు తదితరులున్నారు.

బడి బాగయ్యేనా..?

- శిథిలావస్థకు చేరిన రామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల
- 'మన ఊరు– మన బడి'కి ఎంపికైనా..
- పనులకు ముందుకు రాని కాంట్రాక్టర్లు



శిథిలావస్థలో ఉన్న రామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల భవనం

రామారెడ్డి: శిథిలావస్థకు చేరిన తమ పాఠశాల మన ఊరు– మన బడి పథకానికి ఎంపిక కావడంతో విద్యార్థులు సంబరపడ్డారు. తమ బడి బాగవుతుందని మురిసిపోయారు. కానీ పాఠశాలలో పనులు చేపట్టానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. రామారెడ్డి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో పలు గదులు శిథిలావస్థకు చేరాయి. దీంతో అధికారులు మన ఊరు మన బడి కింద మొదటి విడుతలో ఎంపిక చేశారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు రూ.98 లక్షలు, ప్రాథమిక పాఠశాలకు రూ.58 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో శిథిలమైన తరగతి గదుల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని ఆదేశించారు. అయితే ఈ పనుల కోసం ఎనిమిది సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ నిధులతో భవన నిర్మాణం సాధ్యం కాదని కాంట్రాక్టర్లు అంటున్నట్లు సమాచారం. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కూడా టెండర్లు పూర్తయి పనులు మొదలవుతాయనే నమ్మకం లేదు. రామారెడ్డి ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరినవి పోనూ ఐదు గదులు మాత్రమే ఉన్నాయి. అందులో ఒకటి స్టాఫ్‌రూంకు కేటాయించారు. దీంతో గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో సైతం గదులు సరిపోవడం లేదు. అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణం చేపట్టేలా కృషి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో యోసెఫ్‌ను వివరణ కోరగా టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల నివేదించామని చెప్పారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



అంబారిపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

దోమకొండ: ప్రతి కుటుంబం ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకోని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని అంబారిపేట గ్రామంలో మహిళ సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన చేపల పెంపకం యూనిట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేపల పెంపకం యూనిట్లు ఎనిమిది ఏర్పాటు చేశామని, అదేవిధంగా ఫుడ్ ప్రాసెసింగ్ ఫ్లోర్ మిల్‌ను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులు వ్యవసాయానికి తోడు పాడి పశువుల పెంపకం, కోళ్ల పెంపకం, కూరగాయల సాగు, చేపల పెంపకం వంటివి చేపట్టాలన్నారు. ఉపాధి హామీలో ఫిష్‌పాండ్ ఏర్పాటు చేసుకుని, చేపల పెంపకం చేపట్టవచ్చని వివరించారు. మహిళా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలు ఆదాయ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ ఎండీ సలీం, ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వర్, ఐకేపీ డీపీఎం సురేష్‌బాబు, వకుల, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏపీఎం రాజు ఉన్నారు.

న్యూస్‌రీల్

బంగారం ఆల్‌టైం రికార్డ్



సాక్షి, కామారెడ్డి: బంగారం ధరలు ఆకాశాన్నంటాయి. శుక్రవారం మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.62,750 పలికింది. ఇది ఆల్‌టైం రికార్డు అని వ్యాపారులు అంటున్నారు. రెండు మూడు నెలలుగా బంగారం ధరలు పెరుగుతున్నాయి. ఒక్కోసారి కాస్త దిగుతున్నా, తిరిగి పెరుగుతుండంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం సందర్శించారు. కేంద్రాల్లో ఉన్న ఈవీఎంలు, వీవీప్యాట్‌ల వివరాలను తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.

'ప్రజల ప్రాణాలు హరిస్తున్న ఫ్యాక్టరీని ముట్టడిద్దాం'



భిక్కనూరు: ప్రజల ప్రాణాలను హరిస్తూ పర్యావరణానికి ముప్పు కల్గిస్తున్న ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీని ముట్టడించేందుకు సిద్ధంగా ఉండాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. కాచాపూర్‌లో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం 11వ రోజుకు చేరాయి. శుక్రవారం దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ 11 రోజులుగా నిరసన దీక్షలు చేపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. వీడీసీ చేస్తున్న ఉద్యమానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. దీక్ష శిబిరానికి పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన బీజేపీ నేతలు ర్యాలీగా తరలి వచ్చి సంఘీభావం తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు రెడ్డిగారి రమేశ్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



దోమకొండ: పోలీసులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దోమకొండ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో దొంగతనాల నివారణకు రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఇటీవల నమోదైన కేసులపై ఎస్సై సుధాకర్‌తో మాట్లాడారు. భిక్కనూరు సీఐ తిరుపయ్య, ఏఎస్సై చారి ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



బాన్సువాడ రూరల్: ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీవో సాయన్న అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన హన్మాజీపేట్‌లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేస్తేనే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు జరిగే ప్రదేశంలోనే ఉండి కూలీలకు సౌకర్యాలు సమకూర్చాలన్నారు. సర్పంచ్ సుభాష్, ఉపసర్పంచ్ అక్బర్ ఉన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



డిచ్‌పల్లి: జిల్లాలో విద్యుత్ ప్రమాదాల నివారణకు విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు ఇంజనీరింగ్ అధికారులు సమష్టిగా కృషిచేయాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ (ఎస్ఈ) రవీందర్ సూచించారు. మండల కేంద్రంలోని కేఎస్ఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్ఈ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ఏడాది 100కు పైగా విద్యుత్ ప్రమాదాలు జరిగాయన్నారు. ఈసారి విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. డిచ్‌పల్లి డివిజన్ డీఈ ఉత్తమ్ జాడే ఏడీఈలు బాలేష్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఆదివారం జరిగే నీట్–2023 పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పరీక్ష జిల్లా కో–ఆర్డినేటర్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు సెంటర్‌లోకి ఉదయం 11.30 గంట నుంచి మధ్యాహ్నం 1.30 గంటల లోపు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో 10 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు, ఇందులో 3183 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారన్నారు.

'మన బడులకు' వాచ్‌మెన్‌ల నియామకం

నిజామాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా మన ఊరు–మన బడిలో భాగంగా పనులు పూర్తయిన పాఠశాలలకు వాచ్‌మెన్‌ల నియామకాలను అధికారులు చేపడుతున్నారు. ఇదివరకే రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి పనులు పూర్తయిన 28 పాఠశాలలకు వాచ్‌మెన్ నియామకంపై దృష్టి సారించారు. వేసవి సెలవులు పూర్తయ్యే వరకు వీరు పని చేస్తారు. మరో రెండు రోజుల్లో నియమకాలు పూర్తి చేయనున్నట్లు డీఈవో దుర్గప్రసాద్ తెలిపారు.

ప్రతిపక్ష పార్టీలపైనే ఈడీ, సీబీఐ దాడులు

నిజామాబాద్‌నాగారం: దొల్ల కంపెనీలు పెట్టి కోట్లు ఆర్జిస్తున్న వారిపై ఈడీలు, సీబీఐల దాడులు ఉండవని, కేవలం ప్రతిపక్ష పార్టీలపైనే దాడులు చేసి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆర్థిక, రాజకీయరంగ విశ్లేషకులు ఎస్ వీరయ్య పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఎంప్లాయిస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల మూలంగా కార్పొరేట్ శక్తులు లక్షల కోట్లు ఆర్జించటానికి అవకాశాలు కలిగాయని, దీంతో పేదలు నిరుపేదలగా మారి 25 కోట్లమంది అన్నానికి దూరమయ్యారన్నారు. సెమినార్‌లో రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు రామ్మోహన్ రావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీలో నాగేశ్వరరావుకు డాక్టరేట్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధకుడు నాగేశ్వరరావు డాక్టరేట్ సాధించారు. తెయూ అసోసియేట్ ప్రొఫెసర్ నాగరాజు ఆధ్వర్యంలో 'సింథసిస్ ఆఫ్ నేచురల్ ఫ్లావోస్ అండ్ ఐసోఫ్లావోస్ అనలాగ్స్ ఆఫ్ బయోలాజికల్ పొటెన్షియల్ మాలిక్యుల్స్' అనే అంశంపై నాగేశ్వరరావు సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఓపెన్ వైవా–వోస్‌కు కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సంజీవరెడ్డి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు.

ఆర్థిక సాయం అందని ద్రాక్షేనా?

- గర్భిణులు, బాలింతలకు విడతల వారీగా నగదు పంపిణీని ప్రారంభించిన ప్రభుత్వం
- నిధులు లేక ఏడాదిగా నిలిచిన పథకం



ఆస్పత్రి ఆవరణలో గర్భిణి వివరాలు సేకరిస్తున్న ఆశా కార్యకర్త

మోర్తాడ్(బాల్కొండ): మాతా, శిశు సంరక్షణలో భాగంగా ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు విడతల వారీగా నగదు పంపిణీ పథకాన్ని గతంలో ప్రారంభించింది. విడతలవారీగా నగదును లబ్ధిదారుల ఖాతాలో జమ చేసింది. దీంతో పేదలకు ఆర్థిక చేయూతను ఇచ్చినట్లయింది. కానీ సుమారు ఏడాదిగా లబ్ధిదారులకు ఆర్థికసాయం అందడం లేదు. ఈక్రమంలో నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అమ్మాయికి రూ.13వేలు.. అబ్బాయికి రూ.12వేలు..

ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం కేసీఆర్ కిట్‌తో పాటు నాలుగు విడతల్లో ఆర్థిక సాయంను గర్భిణులు, బాలింతలకు అందించాల్సి ఉంది. అమ్మాయి పుడితే రూ.13వేలు, అబ్బాయి పుడితే రూ.12వేల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. దీని కోసం గర్భిణులు ఆశా వర్కర్ వద్ద తమ వివరాలను నమోదు చేసుకునే సమయంలోనే లబ్ధిదారు బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. గర్భిణులుగా ఉన్న సమయంలో ఒక విడత, ప్రసవ సమయంలో ఒకసారి, చిన్నారులకు పది నెలల వయస్సు వచ్చే సరికి రెండుమార్లు ఆర్థిక సాయం అందించాల్సి ఉంది. కానీ దాదాపు ఏడాది నుంచి గర్భిణులు, బాలింతలకు ఆర్థిక సాయం నిలిచిపోయింది.

జిల్లాలో 6,500 మంది నిరీక్షణ

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు, క్లస్టర్ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్స ద్వారా ప్రసవాలను చేస్తున్నారు. కేసీఆర్ కిట్లను పంపిణీ చేస్తున్నా, ఆర్థిక సాయం అందించే విషయంలో ప్రభుత్వం నుంచి స్పందన కనిపించడం లేదు. జిల్లాలో సుమారు 6,500ల మంది ఆర్థిక సాయం కోసం నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యఆరోగ్య శాఖకు నిధులను విడుదల చేయకపోవడంతోనే గర్భిణులు, బాలింతల ఖాతాల్లోకి ఆర్థిక సాయం నిధులు జమ కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గర్భిణులకు, బాలింతలకు ఆర్థిక సాయం కోసం నిధులు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

గర్భిణులు, బాలింతలకు నగదు పంపిణీ ఇలా..

ఐదు నెలల గర్భిణులకు	రూ.3వేలు
ప్రసవించిన సమయంలో	రూ.5వేలు(పాప జన్మిస్తే) రూ.4వేలు (బాబు జన్మిస్తే)
బిడ్డకు ఐదు నెలలు నిండితే	రూ.2వేలు
పది నెలలు నిండితే	రూ.3వేలు

నయాపైసా రాలేదు..



నా ఇద్దరు కూతుర్లు ప్రసవించి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నయాపైసా ఆర్థిక సాయం వారి ఖాతాల్లో జమ కాలేదు. నాలాగా ఎంతో మంది ఆస్పత్రుల చుట్టూ ఆర్థికసాయం కోసం నిరీక్షిస్తున్నారు. వైద్యులను అడిగితే మా చేతిలో ఏమి లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని చెబుతున్నారు. – సాయన్న, తొర్తి

మొక్కల పెంపకం ఇలాగేనా ?

- కేశాపూర్ నర్సరీ సిబ్బందిపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆగ్రహం



కేశాపూర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం కేశాపూర్ గ్రామ నర్సరీని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం తనిఖీ చేశారు. నర్సరీ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో సిబ్బందిపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సరీలో విత్తనాలు మొలకెత్తకపోవడం, మొక్కలు ఏపుగా పెరగకపోవడంపై స్థానిక అధికారులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. నర్సరీ నిర్వహణ ఇలా ఉంటే, హరితహారం మొక్కలు ఎలా నాటుతారని అధికారులను నిలదీశారు. నర్సరీ నిర్వహణను వెంటనే చక్కదిద్దాలని, హరితహారం కార్యక్రమానికి ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో మల్లేష్‌తో పాటు కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎంపీడీవోకు సూచించారు. అంతకుముందు కేశాపూర్‌లో కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అకాల వర్షాలకు తాము పండించిన వరిధాన్యం పంట తడిసి పోయిందని తాము నష్టపోకుండా ఆదుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ.. తడిసిన వరిధాన్యాన్ని ఒక లోడ్ వరకు రైస్‌మిల్లులకు పంపేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రవి, సర్పంచ్ మల్లె వనిత సుభాష్ తదితరులు ఉన్నారు.

కడ్తా అడిగితే బ్లాక్ లిస్ట్‌లో పెడతాం

సుభాష్‌నగర్: జిల్లాలోని రైస్‌మిల్లర్లు అనవసరంగా రైతులను ఇబ్బంది పెట్టవద్దని, కడ్తా అడిగినట్లు ఫిర్యాదు వస్తే మిల్లును బ్లాక్ లిస్ట్‌లో పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. కోటగిరిలోని సిరాజ్ పారాబాయిల్డ్ రైస్‌మిల్లు యాజమాన్యం ప్రతి బస్తాకు కడ్తా అడుగుతుందని, లేకుంటే ధాన్యం దించుకోవడం లేదని ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఈవిషయమై పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్‌ను విచారణ చేపట్టి, నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించామన్నారు. రైస్‌మిల్ వారు ఎక్కువ కడ్తా అడుగుతున్న విషయం నిజమేనని డీటీ విచారణలో తేలిందన్నారు. అందుకోసం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆ రైస్‌మిల్‌కు తదుపరి ధాన్యం పంపవద్దని ఆదేశించారు. సదరు మిల్లును బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని రైస్‌మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం దించుకోవాలని సూచించారు. కడ్తా అడుగుతున్న మిల్లర్లపై విచారణ చేపట్టి, ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించిన మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చంద్రశేఖర్ హెచ్చరించారు.

రేపు జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా రూరల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న ఆర్మూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల(బాలుర) మైదానంలో ఉదయం 10గంటలకు క్యారం, చెస్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్‌లల్లో క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని కార్యదర్శి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 16బాలబాలికలకు ఎంపికలు ఉంటాయన్నారు. ఎంపికైనా క్రీడాకారులను త్వరలో ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. వివరాలకు 8919833851, 9014581059 సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్

పెళ్లి బస్సుకు తప్పిన ప్రమాదం

- అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లడంతో పలువురికి స్వల్ప గాయాలు



లక్కంపల్లి శివారులో అదుపుతప్పిన బస్సు

నందిపేట్(ఆర్మూర్): పెళ్లి వేడుక కోసం బయలుదేరిన బస్సుకు పెను ప్రమాదం తప్పింది. అదుపు తప్పడంతో బస్సు పంటపొలాల్లోకి దూసుకుపోయింది. వివరాలు ఇలా.. నందిపేటకు చెందిన ఓ ప్రయివేట్ పాఠశాల బస్సులో శుక్రవారం నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామం నుంచి పెళ్లి బృందం మాక్లూర్‌కు బయలుదేరింది. మార్గ మధ్యలో లక్కంపల్లి గ్రామసమీపంలో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే గల చెట్టును ఢీకొడుతూ పొలాల మడిలో ఒరిగింది. బస్సులో సుమారు 50మంది ప్రయాణిస్తున్నారు. ఘటనలో బస్సులో ప్రయాణించిన కొందరికి స్వల్ప గాయాలు కాగా వారిని స్థానికులు అంబులెన్సులో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవరు అతివేగంగా నడపడంతోనే ప్రమాదం సంభవించిందని, చెట్టును ఢీకొనడంతోనే పెద్ద ప్రమాదం తప్పిందని, లేదంటే బస్సు పల్టీలు కొడుతూ పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు వెల్లడించారు.

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు



దూపల్లి గేట్ వద్ద బోల్తా పడిన కారు

ఎడపల్లి(బోధన్): మండలంలోని దూపల్లి గేటు వద్ద శుక్రవారం బైక్‌ను కారు ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న అటవీశాఖ కానిస్టేబుల్ లింబాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. లింబాద్రి తన బైక్‌ను దూపల్లి గేటు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా.. వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింబాద్రికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎడపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి



బ్యాగరి రవి (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు రోడ్డుపై రెండు బైకులు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా.. లింగంపేట మండలం బాణాపూర్ గ్రామానికి చెందిన బ్యాగరి రవి(40) శుక్రవారం బైక్‌పై లింగంపేటకు వస్తుండగా.. రామలక్ష్మణ్‌పల్లికి చెందిన దాసరి కాశీ రాం లింగంపేట నుంచి రామలక్ష్మణ్‌పల్లికి వెళ్తుండగా.. నల్లమడుగు రోడ్డుపై ఇటుక బట్టీల సమీపంలో ఇరువురి బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యా యి.రవిని లింగంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. తీవ్ర గాయాలైన కాశీరాంను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

చెరువులో పడి ఒకరు..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్పూర్ గ్రామ చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్ద పండుగను నిర్వహించేందుకు గంగపుత్ర సంఘం ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడికి వెళ్లిన రాము (42) బండమీద నిలబడే క్రమంలో అదుపుతప్పి చెరువులో పడిపోయారు. చెరువులో వల వేసి ఉండటంతో రాము వలలో చిక్కుకుని ఊపిరాడక మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సరైన ఉద్యోగం రావడం లేదని యువకుడి ఆత్మహత్యాయత్నం

భిక్కనూరు: తాను చదివిన చదువుకు సరైన ఉద్యోగం రావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలోని రామేశ్వర్‌పల్లిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన కుడిక్యాల భావేశ్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యను అభ్యసించాడు. మండల కేంద్రం సమీపంలోని ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీలో మూడేళ్లపాటు ఉద్యోగం చేశాడు. గత కొద్ది నెలలుగా హైదరాబాద్ వెళ్లి ఇటీవలనే గ్రామానికి తిరిగి వచ్చాడు. తాను చదివిన చదువుకు సరైన ఉద్యోగం రావటం లేదని కొన్నిరోజులుగా తరచు బాధపడేవాడు. ఈక్రమంలో గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి, సమీపంలోని అటవీ ప్రాంతంలో గడ్డి మందు తాగి, తనకు సరైన ఉద్యోగం రావటం లేదని అందుకే ఈ లోకం విడిచిపోతున్నానని తన స్నేహితునికి ఫోన్‌లో తెలిపాడు. వెంటనే సదరు స్నేహితుడు ఈ విషయాన్ని భావేశ్ కుటుంబీకులకు గ్రామస్తులకు తెలుపగా వారు అదే రాత్రి ఘటన స్థలానికి చేరుకుని భావేశ్‌ను గుర్తించి, వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయమంగా ఉందని వైద్యులు తెలుపడంతో సిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేట గ్రామంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం భావేశ్ పరిస్థితి విషయమంగానే ఉందని గ్రామస్తులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో నెమలి మృత్యువాత



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్ తగలడంతో నెమలి మృతి చెందింది. శుక్రవారం ఉదయం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నెమలి మృతి చెందడాన్ని స్థానికులు గమనించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు సమాచారం అందించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హైందవికి మృతి చెందిన నెమలిని అందజేశారు.

దేశంలో కాంగ్రెస్ పార్టీని నిషేధించాలి





బీజేపీ నేత ధన్‌పాల్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు.. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య
- డీసీసీ కార్యాలయం ఎదుట హనుమాన్ చాలీసా పఠనానికి బీజేపీ యత్నం
- అడ్డుకున్న పోలీసులు

సుభాష్‌నగర్: దేశంలో హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న కాంగ్రెస్ పార్టీని నిషేధించాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భజరంగ్‌దళ్‌పై నిషేధం విధిస్తామని మేనిఫెస్టోలో చేర్చి హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఈమేరకు బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట హనుమాన్ చాలీసా పారాయణం చేసేందుకు ప్రయత్నించారు. బీజేపీ నాయకులు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈక్రమంలో కొంత తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు బలవంతంగా బీజేపీ నాయకుల ను అరెస్ట్ చేసి, నాలుగో టౌన్‌కు తరలించారు. వారు పోలీసుల తీరును నిరసిస్తూ అక్కడే హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా హనుమాన్ చాలీసా పారాయణం చేస్తే పోలీసులు అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. నిషేధించాల్సింది భజరంగ్‌దళ్‌ను కాదని, కాంగ్రెస్ పార్టీని అని విమర్శించారు. దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న పీఎఫ్ఐ వంటి సంస్థలకు కాంగ్రెస్ మద్దతిస్తూ, దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. అయోధ్యలో శ్రీరాముని ఆలయం కట్టకుండా కాంగ్రెస్ అడ్డుకుందని, ధర్మం, ధర్మరక్షకుల జోలికొస్తే తరిమి కొడతామని హెచ్చరించారు.

డీసీసీ కార్యాలయం వద్ద పోలీసులు

బీజేపీ నాయకుల 'హనుమాన్ చాలీసా' కార్యక్రమం తెలుసుకుని కాంగ్రెస్ కార్యాలయం వద్ద పోలీసులను భారీగా మోహరించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇన్‌చార్జి సీపీ జోక్యం చేసుకుని, బీజేపీ నాయకులు ఇక్కడికి రాకుండా చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో వారు వెళ్లిపోయారు.



రోడ్డుపై బైఠాయించి హనుమాన్ చాలీసా పఠిస్తున్న బీజేపీ నాయకులు

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- ఏసీపీ ప్రభాకర్‌రావు
- ఆర్మూర్ పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న ఏసీపీ ప్రభాకర్ రావు

ఆర్మూర్‌టౌన్: ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావు సూచించారు. పట్టణంలోని పోచమ్మగల్లీలో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు.ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. తల్లితండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా అదుపులో ఉంచాలన్నారు.దీంతోపాటు ప్రజల భాగస్వామ్యంతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే చోరీలు జరగకుండా అరికట్టవచ్చన్నారు. ఎక్కడైన అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పోలీసులు ప్రతి ఇంటిని తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరైన పత్రాలు లేని నాలుగు ఆటోలు, 40 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్‌వో సురేశ్ బాబు, రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కోసమే చైన్ స్నాచింగ్



బోధన్‌లో మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

బోధన్‌టౌన్(బోధన్): మోస్రా మండలకేంద్రంలో గత నెల 30న జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు కట్టడం కోసమే నిందితుడు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారని ఏసీపీ కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. మోస్రా మండల కేంద్రానికి చెందిన బోయిడి సుజాత తన కొడుకుతో కలిసి కూర్నాపల్లి రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం తీసుకు రావడానికి ఏప్రిల్ 30న ఉదయం బైక్‌పై వెళ్లారు. వీరి వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి హోండా ఆక్టీవాపై వేగంగా వచ్చి సుజాత మెడలో నుంచి మంగళ సూత్రాన్ని తెంచుకొని పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. స్పెషల్ క్రైం పార్టీ ఏసీపీ బాబురావ్ బృందంతో పాటు సీఐ జాన్ రెడ్డి సీసీటీవీ పుటేజీల పరిశీలించి, ఎడపల్లికి చెందిన కంటెడి ప్రణయ్ అలియాస్ బన్ని చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. క్రికెట్ బెట్టింగ్‌లో బుకీస్‌కు డబ్బులు చెల్లించడాని కోసమే చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. గతంలో అతడి తల్లి బంగారంను అమ్మి బుకీస్‌కు డబ్బులు చెల్లించాడన్నారు. ఆ బుకీస్ ఎవరు అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. సీఐ జాన్ రెడ్డి, ఎస్సైఅనీల్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

గంజాయి గొడవే హత్యకు దారితీసింది

- తిర్మన్‌పల్లి యువకుడి హత్య కేసు ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్ కుమార్

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామ శివారులో గత నెల 23న జరిగిన షేక్ నబీసాబ్ అలియాస్ అక్బర్(24) అనే యువకుడి హత్య కేసును ఛేదించినట్లు ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. గంజాయి గొడవే హత్యకు దారితీసిందని తెలిపారు. శుక్రవారం ఆయన నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి, కోర్టులో హాజరుపర్చారు. ఏసీపీ తెలిపిన వివరాలు ఇలా.. గత నెల 23న షేక్ నబీ, మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన అతని మిత్రుడు జావీద్‌తో కలిసి ఇందల్వాయిలోని మద్యం దుకాణంలో మద్యం తాగుతున్నారు. ఈక్రమంలో రాంపూర్ విశ్వ ఆగ్రోటెక్‌లో పని చేస్తున్న బిహార్‌కు చెందిన సికింద్ర కుమార్, రోహిత్ కుమార్, ధర్మేంద్ర కుమార్ వారికి తోడై గంజాయి కావాలని వారిని అడగారు. దీంతో షేక్‌నబీ, జావిద్ నిందితుల వద్ద నుంచి వెయ్యి రూపాయలు తీసుకొని సదాశివనగర్ మండలం గాందారి ఎక్స్‌రోడ్‌కి తీసుకొని వెళ్లారు. అక్కడి నుంచి జావిద్ పారిపోగా, షేక్ నబీని నిందితులు పట్టుకొని తిర్మన్‌పల్లి శివారులోని విశ్వ ఆగ్రోటెక్ సమీపంలోని వారి గదికి తీసుకెళ్లారు. గంజాయి ఇవ్వకుండా తమని మోసం చేస్తావా అని తుపాకితో బెదిరించి, మద్యం మత్తులో గది నుంచి రోడ్‌పైకి లాక్కెళ్లి, తలను రోడ్డుకేసి కొట్టి, గొంతు పిసికి హత్య చేశారు. అనంతరం పక్కనున్న ఖాళీ స్థలంలో మృతదేహాన్ని పారేసినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నిందితులను గురువారం ఉదయం నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి ఒక తపంచ తుపాకి, రెండు బుల్లెట్లు, మూడు మోటార్ సైకిల్లు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామన్నారు. కేసు చేధనకు కృషి చేసిన డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఇందల్వాయి ఎస్సై నరేష్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఎడపల్లి(బోధన్): మండలంలోని కుర్నాపల్లిలో శుక్రవారం వేకువజామున తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కొండా మోహన్ అనే వ్యక్తి ఇటీవల తన ఇంటికి తాళం వేసి, తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. దీంతో దుండగులు తాళం వేసి ఉన్న ఇంటిని గమనించి, తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి 5తులాల బంగారం, 10 తులాల వెండిని చోరీ చేశారు. ఈమేరకు కొండా మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. మోహన్ ఇంటితో పాటు సమీపంలో ఉన్న కిరాణా షాపులోనూ దుండగులు చోరీకి యత్నించినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

LOANS

■ సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785500]

WANTED

■ Wanted All Subject Teachers for Nursery to 5th Class. P.E.T., Computer Operator (Dtp Knowledge), Computer Teacher (Programming Knowledge). BBC High School, Sainagar - 3, Varni Road, Nzb. 94404 76854. [Z-799451]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-10756]

■ Hyd లో ప్రముఖ E-కామర్స్, ఫార్మా, MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను. రూం, భోజనం ఫ్రీ. జీ. 15,000-30,000. ఫోన్ : 9121989324. [HA-11021]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 16K-18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్ : 9640258889. [H-793423]

■ పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9440828190 [HA-6164]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ / పురుషులు కావలయును. జీతం: 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786224]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.